

బాచుపల్లి పోలీసులకు పట్టుబడిన 5 లారీలు సీజ్ చేసి స్టేషన్‌లో..


# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శనివారం | 24 ఆగస్టు 2024 | పేజీలు 8


# ప్రభుత్వ భూముల్లో... భవన నిర్మాణ వ్యర్ధాలు


నిజాంపేట్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పక్కన భవన నిర్మాణ వ్యర్ధాల డంపింగ్..

- నిజాంపేట్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద ప్రభుత్వ భూమిలో బిల్డింగ్ వ్యర్ధాల డంపింగ్ ..!
- మట్టి పోసుడే కానీ తొలగింపు ఉండదు.. అధికారులు చూసుడే కానీ చర్యలు శూన్యం..
- అక్రమార్కులతో అధికారుల దోస్తీ..! ప్రశ్నించే వారితో కుస్తీ..!

- నిజాంపేట్ సర్వే నెంబర్ 186 ప్రభుత్వ భూమిలో రాత్రిపూట బిల్డింగ్ వ్యర్ధాల డంపింగ్..
- వ్యర్ధాలు అక్రమ రవాణా చేస్తున్న 5 లారీలను సీజ్ చేసిన బాచుపల్లి పోలీసులు..
- పోలీస్ స్టేషన్‌లో లారీలు.. లారీలకు జరిమానా విధించి హెచ్చరించిన పోలీసులు..
- గతంలో బౌరంపేట్ సర్వే నెంబర్ 472 ప్రభుత్వ స్థలంలోనూ మట్టి నింపినా పట్టించుకోని రెవెన్యూ..
- అధికారుల పట్టింపులేక, గత జులై 17న 4 అక్రమ కట్టడాలు.. స్థానికుల ఫిర్యాదుతో డిమాలిషన్..
- జులై 31న సదరు బౌరంపేట్ 472 ప్రభుత్వ స్థలాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్..
- సదరు ప్రభుత్వ భూమిని దిల్ సంస్థకు కేటాయించి నట్లు అదనపు కలెక్టర్ వెల్లడి..
- ప్రభుత్వ భూముల్లో మట్టి నింపిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్..

-2లో

మాధవ్ పత్తి.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 23:

ప్రభుత్వ భూములు, చెరువులు, కట్టుకాలువల పట్ల, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కబ్జాల పర్వం తేటతెల్లం చేస్తుంది..ప్రభుత్వ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ, కబ్జాదారులు లక్షలు, కోట్లు గడిస్తున్నారు..! పలు విధాలుగా, ప్రజావాణి ఫిర్యాదులతో పాటు..! జిల్లా యంత్రాంగానికి నేరుగా ఫిర్యాదులు అందజేసినా చర్యలు తీసుకోవడం లేదని, అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ..! విపక్షాల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నది నిత్యం గమనిస్తున్నాం.. తాజాగా నిజాంపేట్ 186 ప్రభుత్వ భూమిలో భవన నిర్మాణాల వ్యర్ధాల డంపింగ్.. గతంలో బౌరంపేట్ 472 ప్రభుత్వ భూమిలోనూ బిల్డింగ్ వ్యర్ధాల డంపింగ్ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.. బౌరంపేట్ ప్రభుత్వ భూమి డంపింగ్‌ను స్వయంగా అదనపు కలెక్టర్ సందర్శించిన విషయం తెలిసిందే.. సర్కాతు భూమిలో మట్టి డంపింగ్‌లపై ఎప్పటికప్పుడు హడావుడి చేస్తున్నారు.. కానీ, సంబంధిత అధికారులు కబ్జాదారులపై శాశ్వత చర్యలు చేపట్టలేక పోతున్నారు.. మరికొన్ని చోట్ల అక్రమారులు తమ ఖరీదైన కార్లలో, అధికారులను తిప్పుతుండటం చర్చనీయాంశంగా మారింది..

# విద్యార్థులకు రుచికరమైన.. సన్నబియ్యం భోజనం..



- మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..
- అలియాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలను జేసి ఆకస్మిక తనిఖీ..
- భోజనం పరిశుభ్రంగా ఉండాలని.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్..

-4లో

# గిరిజన మహిళ.. దారుణ హత్య..

- బలమైన ఆయుధంతో తలపై కొట్టడంతో మృతిచెందినట్లు భావిస్తున్న పోలీసులు..
- దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి.. తాండా-2లో ఘటన..

-3లో




# ప్రభుత్వ భూముల్లో.. భవన నిర్మాణ వ్యర్థాలు..



బాచుపల్లి పోలీసులు సీజ్ చేసిన లారీలు..



బౌరంపేట్ సర్వే నెం.472 దిల్ సంస్థ భూమిలో గత మే నెలలో మట్టినింపిన కబ్జాదారులు..ఫైల్ ఫోటో.




బౌరంపేట్ 472 లో దిల్ సంస్థకు చెందిన హెచ్చరిక బోర్డు..



నిజాంపేట్‌లో వ్యర్థాలను డంపింగ్ చేసి వెళ్తున్న టిప్పర్ లారీ..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కబ్జా చేయడం అత్యంత సులువైన మార్గంగా భావిస్తున్నారు.. ఈజీ మనికోసం దొంగతనాలు, దోపిడీలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారి కంటే..! భూ కబ్జాదారులే ప్రమాదకరంగా తయారవుతున్నారు.. ఇద్దరికీ పెద్ద తేడా ఏమిలేదని ఎద్దేవా చేస్తున్నారు..! మొదటి మూడింటికీ ఎవరి అండ లేకపోయినా, రెచ్చి పోతున్నారు.. కానీ భూ బకాసురులకు మాత్రం, కొందరు అవినీతి అధికారుల అండతోనే కబ్జాలు జరుగుతున్నట్లు "హైడ్రా" కూల్చివేతలే నిదర్శనం.. ఉదాహరణకు దుండిగల్ మండలంలోని "మీది ముల్లవాణి కుంట" చెరువు కబ్జాలో 2024 ఏప్రిల్ 16న కూల్చివేతలు చేపట్టిన అధికారులు.. అదేచోట తాజాగా 2024 ఆగష్టు 16 వరకు మళ్ళీకబ్జాకు పాల్పడ్డారని, పెన్ పవర్ దినపత్రికలో ఆధారాలతో వార్త వచ్చినా..! చర్యలు తీసుకోకపోవడంలోనే..! అధికారుల విధుల పారదర్శకత,ఎలా ఉందో స్పష్టమవుతుందని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి..

## బిల్డింగ్ వ్యర్థాల డంప్ చేస్తున్న లారీలు సీజ్..పోలీస్ స్టేషన్‌కి తరలింపు..

భవన నిర్మాణ వృదా మెటీరీయల్‌ను, భారీ టిప్పర్లతో రాత్రిపూట జనావాసాల ప్రాంతాలకు దగ్గరలో డంప్ చేస్తుండగా..! బాచుపల్లి పోలీసులు 5 లారీలను పట్టుకొని సీజ్ చేశారు.. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం, సూరారం, ఖైసర్ నగర్‌ల నుండి కన్‌స్ట్రక్షన్ వ్యర్థాలను బాచుపల్లి సమీపంలోని నిజాంపేట్ సర్వే నెంబర్ 186 ప్రభుత్వ భూముల్లో డంపింగ్ చేస్తూ, కబ్జాలకు పాల్పడుతున్నారు.. నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతాలలో స్థానికులకు ఇబ్బంది కలిగిస్తూ రాత్రి పూట శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం చేస్తూ వ్యర్థాలను తరిలిస్తున్న విషయం తెలుసుకున్న బాచుపల్లి పోలీసులు మాటువేసి ఐదు లారీలను పట్టుకొని సీజు చేసి, జరిమానా కూడా విధించినట్లు పోలీసులు తెలిపారు. ఇక ముందుకూడా ఇలాంటి పనులు పునావృతం అయితే కఠినమైన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బాచుపల్లి సీఐ ఉపేందర్ రావు అక్రమ డంపింగ్ దారులను హెచ్చరించారు.. ఇదిలా ఉండగా ఈ డంపింగ్ వ్యవహారంలో స్థానిక నాయకులకు, సంబంధిత అధికారులకు సదరు డంపింగ్ లారీల కాంట్రాక్టర్ నుండి పెద్ద మొత్తంలోనే ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి..



బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమిలో గత జూలై 31న కబ్జాలను పరిశీలిస్తున్న జెసి విజయేందర్ రెడ్డి..

ఇటాచ్చీతో చదును చేస్తున్న..ఫైల్ ఫోటో..



# గిరిజన మహిళ.. దారుణ హత్య..

## బలమైన ఆయుదంతో తలపై కొట్టడంతో మృతిచెందినట్లు భావిస్తున్న పోలీసులు..

## దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి.. తాండా-2లో ఘటన..







**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 23:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ తండా-2లో ఓ ఒంటరి మహిళ దారుణహత్య స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది.. గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మహిళ తెల్లవారే సరికి హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపుతోంది.. గుర్తుతెలియని దుండగులు తలపై పదునైన ఆయుధంతో కొట్టడంతో సదరు మహిళ మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ తండా- 2కు చెందిన జరుపాల శాంతి (50), బాలునాయక్ దంపతులు, వీరికి ఓ కొడుకు, కూతురు ఉంది. 20 ఏండ్ల క్రితమే బాలునాయక్ చనిపోగా, ఐదేండ్ల క్రితం కొడుకు మరణించాడు. దీంతో శాంతి తండాలోనే ఉంటూ డబ్బాదుకాణం ద్వారా జీవనం కొనసాగిస్తుంది.. ఈ నేపధ్యంలో గురువారం రాత్రి భోజనానంతరం నిద్ర పోయింది. అయితే శుక్రవారం ఉదయం శాంతి మృతదేహం దుప్పట్లో చుట్టి ఉండటం గమనించిన కూతురు ఉమారాణి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న దుండిగల్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా తలవెనుక వైపు గాయం ఉండటం గమనించారు. తలపై పదునైన ఆయుధంతో మోదడంతో మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శవాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ వైద్యశాలకు తరలించారు.

### సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీసీపీ...

సంఘటన జరిగిన దుండిగల్ తండా-2 లో శాంతి ఇంటిని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఎసీపీ శ్రీనివాసరెడ్డి, సీఐ సతీష్‌తో కలిసి సందర్శించారు. హత్యజరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం ఫింగర్ ప్రింట్ ఆధారాలను సేకరించి, పోలీస్ జాగిలాలతో శోధించగా మృతురాలి అల్లుడు భాస్కర్ నాయక్ చుట్టూ తిరుగుతూ ఆగిపోయినట్లు తెలుస్తుంది..



### అల్లుడే హతమార్చాడా...?

శాంతిని తన అల్లుడు భాస్కర్ నాయక్ హతమార్చాడా...? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అదే తండాలో నివాసం ఉంటున్న తన కూతురు ఉమారాణి, అల్లుడు భాస్కర్ నాయక్ ప్రతిరోజు ఎవరో ఒకరు ఉదయంపూట శాంతిని నిద్రలేపుతుంటారు. అయితే ఎక్కువగా భాస్కర్ నాయక్ తన అత్తను నిద్రలేపేవాడని, శుక్రవారం మాత్రం ఆయన అటువైపు రాలేదని తెలుస్తుంది శాంతికి తండా -2లో అర ఎకరం భూమి ఉందని, సుమారు రూ. 3 కోట్ల విలువచేసే ఆస్తిని కాజేసేందుకే అల్లుడు భాస్కర్ నాయక్ ఇంతటి దారుణానికి ఒడిగట్టి ఉంటాడని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. పోలీస్ జాగిలం సైతం బాస్కర్ నాయక్ చుట్టూ తిరుగుతూ అతనివద్దే అగిపోవడం పట్ల అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. పైగా భాస్కర్ నాయక్ కు గతంలో నేరచరిత్ర ఉందని పేర్కొంటున్నారు. పోలీసులు ఈ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.







# విద్యార్థులకు రుచికరమైన.. సన్నబియ్యం భోజనం..



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసి..




- మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..
- అలియాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలను జేసి ఆకస్మిక తనిఖీ..
- భోజనం పరిశుభ్రంగా ఉండాలని.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 23:** విద్యార్థులకు సన్నబియ్యంతో అందించే మధ్యాహ్న భోజనం రుచిగా పరిశుభ్రంగా ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణను పరిశీలించారు.. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు సన్నబియ్యంతో అందించే మధ్యాహ్న భోజనం రుచిగా పరిశుభ్రంగా ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.. పాఠశాలలోని తరగతి గదులను అదనపు కలెక్టర్ కలియ తిరిగి పరిశీలించారు. వంటశాలను పరిశీలించిన ఆయన పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకొని మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకొవాలని అదనపు కలెక్టరు విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం ప్రతి రోజు పెడుతున్నారా..! భోజనం ఏలా ఉంటుందని..? విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి భోజనం చేశారు..



# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 23**



విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా 11 కేవి శిల్పా నగర్ ఫీడర్ పరిధిలోని శనివారం మధ్యాహ్నం 11.30 నుండి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ జె.కామేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శిల్పానగర్, మోడీ అపార్ట్‌మెంట్, లోటస్ కాలనీ, శివ సాయి కాలనీ, సత్యనారాయణ కాలనీ, బిబిసి కాలనీ నాగారంలోని సాయి వెంకటాద్రి కాలనీ, ఎస్సీ కాలనీ, శ్రీనివాస్ నగర్ కాలనీ, ఓం సాయి నగర్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, కేబుల్ కాలనీ, బాల్ రాజ్ రెడ్డి నగర్, మల్లికార్జున నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, అలాగే 11 కేవి బాబు రెడ్డి కాలనీ ఫీడర్, 11 కేవి ఎస్వి నగర్ ఫీడర్ పరిధిలోని ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శిల్పా నగర్, మోడీ అపార్ట్‌మెంట్, లావణ్య ఎన్‌క్లేవ్, ప్రగతి ఎన్‌క్లేవ్, చక్రాదర ఎన్‌క్లేవ్, బాబు రెడ్డి కాలనీ, లోటస్ కాలనీ, రేణుకా ఎల్లమ్మ కాలనీ, ఎస్వి నగర్, పిఎంఆర్ ఎన్‌క్లేవ్, ఎస్ఎంహెచ్ ప్లాజా, వెంకటాద్రి కాలనీ, మామిళ్ల నారాయణ కాలనీ, వివిఎస్ఎన్ గార్డెన్, బ్రహ్మయ్య కాలనీ, ఈశ్వర పురి కాలనీ, సాయి నివాస్ నగర్, జిపి కాలనీ, సాయి శుక్ల కాలనీ, కెకె గార్డెన్, సంఘమిత్ర కాలనీ, అదేవిధంగా 11 కేవి గాంధీ నగర్ ఫీడర్ పరిధిలోని ఉదయం 11 నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు బిఎంఆర్ ఎన్‌క్లేవ్, దత్తాత్రేయ కాలనీ శివ శక్తి కాలనీ, ఎస్ఎల్ఎన్ కాలనీ, వెస్ట్ గాంధీనగర్, శివాలయ నగర్, గాంధీనగర్, భవాని నగర్‌లో ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదా రులు తమకు సహకరించాలని కోరారు.

# జెవివి ఆధ్వర్యంలో ఆదివారం మెగా మెడికల్ క్యాంపు



**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 23:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో "మెగా మెడికల్ క్యాంపు" నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆహ్వానించామని జెవివి మేడ్చల్ జిల్లా నాయకులు పి.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహిస్తున్న బీపీ, షుగర్ మెడికల్ క్యాంపు 9వ వార్షికోత్సవం సందర్భంగా 25 వ తేదీ ఆదివారం ఉదయం 07:00 నుండి 10:00 గంటల వరకు చక్రిపురంలోనే "శ్రీ చక్రి విద్యా నికేతన్" స్కూల్ లో జెవివి, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపుకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జెవివి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి మెడికల్ క్యాంపుకు ఆహ్వానించారు. మెడికల్ క్యాంపులో వివిధ కాలనీవాసులు పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9989925997 సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలోన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ముప్పా శ్రీనివాస్, నాయకులు సోమయ్య చారి, సిఎన్ శేషు, నాగేశ్వరరావు, ఎ.కె.దుర్గాచారి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వద్దు.. గ్రామ పంచాయతే ముద్దు



**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 23**
గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై కీసర ప్రజలు మండిపడుతున్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండలంలో గ్రామాలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామసభ ముఖ్య ఉద్దేశం గ్రామ పంచాయతీలో ఉన్న గ్రామాలన్నీ విలీనం చేయడానికి అధికారులు గ్రామ ప్రజల సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. ఓ ఆర్ ఆర్ లోపల గ్రామాలన్ని జీహెచ్ఎంసీలో కలుపవద్దని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీగా ఉండాలని గ్రామస్థులు తీర్మానం చేసి వినతిపత్రం అధికారులకు అందజేశారు. ప్రజాభిప్రాయం సేకరణ ప్రకారమే మున్సిపాలిటీలో విలీనం చేయాలని, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇష్ట ప్రకారమే అధికారులు నడుచుకోవాలని, లేదంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మున్సిపాలిటీలో గ్రామాన్ని విలీనం చేయడం వల్ల ఉనికి కోల్పోవడంతో పాటు పన్నుల భారం పెరుగుతుందని అభివృద్ధికి నోచుకోదన్నారు. మున్సిపల్ వద్దు గ్రామపంచాయతీ ముద్దు అంటూ నినాదాలు చేసుకుంటూ గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలి

## చైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్



**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 23**
మన పరిసరాల్లో వాడకంలో లేని పాత్రలు, సామాగ్రిలో నీరు నిల్వ లేకుండా చూడాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్ ప్రజలకు వివరించారు. డ్రై డే ఫ్రై డే "కార్యక్రమం లో భాగంగా శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని 3వ వార్డు లో కమిషనర్ నాగమణి తో కలిసి పర్యటించారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గృహాల వద్ద పరిసర ప్రాంతాల్లో, ప్రభుత్వ, అంగన్ వాడి స్కూల్ వద్ద పిచ్చి మొక్కలు ఉండకుండా చూడాలని, మురికి కాలువలో నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్, దోమలు ఉండకుండా కెమికల్ చల్లడము జరిగింది. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికీ తిరుగుతూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి అవగాహన కల్పించారు. ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, టైర్ లలో నీరు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచించారు. ఎక్కువ కాలం నీరు నిల్వ వలన దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొత్త హేమలత శ్రీనివాస్ గౌడ్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మహిళా సంఘాల నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి చేనులో ప్రత్యక్షమైన మొసలి..

# భయంతో కూలీల పరుగులు..



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని దేవరచెరువు వెనుక ఓ సీడ్ పత్తి చేనులో ఒక మొసలి ప్రత్యక్షమైంది. ఉదయం పొలంలో పనిచేస్తున్న కూలీలకు మొసలి కనిపించడంతో భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న అటవీ సిబ్బంది రైతుల సహాయంతో మొసలిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మహబూబ్ నగర్ జిల్లా సహకార బ్యాంకు నూతన చైర్మన్‌గా మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి




**హైదరాబాద్ పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నూతన చైర్మన్ గా వనపర్తి జిల్లాకు చెందిన మామిళ్ల పల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. చైర్మన్ పదవి కోసం డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఒకే ఒక నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్ కు ఎన్నికల నిర్వహణ అధికారి టైటస్ పాల్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, పర్ణిక రెడ్డి, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్ రెడ్డి, మేఘరెడ్డి నూతనంగా ఎన్నికైన చైర్మన్?కు శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలను అందించాలని కోరారు.

# హైదరాబాద్‌లో క్లౌడ్ బరస్ట్.. 6 అడుగుల పరిధిలోనే కురిసిన వర్షం



**హైదరాబాద్ పెన్ పవర్:**క్లౌడ్ బరస్ట్ గురించి అప్పుడప్పుడు వింటుంటాం కదా.. హిమాలయ పర్వత పాదంలో ఉన్న ఉత్తరాది రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జార?ండ్ వంటి రాష్ట్రా ల్లో క్లౌడ్ బరస్ట్ ఎక్కువగా సంభవిస్తుంది. దీంతో అక్కడి ప్రాంతాలు ఒక్కసారిగా వరదబారినపడతాయి..ఇదంతా మనం సోషల్ మీడియాలో, టీవీల్లో చూస్తూనే ఉన్నాం.. అయితే శుక్రవారం ఆగస్టు 23, 2024 నాడు మన హైదరాబాద్ లో కూడా క్లౌడ్ బరస్ట్ సంభవించింది.. ఇది నిజం.. హైదరాబాద్ నగరంలోని మురాద్ నగర్ పోస్టాఫీసు లైన్ లో క్లౌడ్ బరస్ట్ అయ్యి.. కేవలం 6అడుగుల పరిధిలోని భారీగా వర్షం కురిసింది. ఈ అనుకోని సంఘటనను కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో బాగా వైరల్ అవుతుంది.

# గాంధారీ ..శ్రీకృష్ణునికి ఇచ్చిన శాపం ఏమిటి... శాపం ఫలించిందా...

కౌరవులు అంతం అవడంతో మహాభారతం ముగిసిపోలేదు. ఆ తర్వాత పాండవులు, యాదవ వంశం, కృష్ణుడి మరణం సంభవించాయి. అన్నిటి కన్నా ముఖ్యమైన విషయం కృష్ణుడి మరణం (అవతారం చాలించడం) ఎలా జరిగిందంటే..కృష్ణుడు 36 ఏళ్లలో చనిపోవాలనే గాంధారీ శాపం ఏమిటి? శాపం ఫలించిందా... కురుక్షేత్రంలో ఏం జరిగింది?

శ్రీ కృష్ణుడు అవతారం చాలించాడు, ఆతర్వాత ద్వారక నీటమునిగిందని చెబుతారు.. అయితే తనకు తానుగా అవతారం చాలించలేదని.. గాంధారి శాపం కారణంగా మహాభారత యుద్ధం ముగిసిన మూడున్నర దశాబ్దాల తర్వాత కృష్ణుడు అవతారం చాలించాడని చెబుతారు.



గాంధారి శాపం

కురుక్షేత్ర యుద్ధంలో తన వందమంది సంతానాన్ని పోగొట్టుకున్న గాంధారి.. ద్వారక మునిగిపోవాలని, కృష్ణుడు 36 ఏళ్లలో మరణించాలని శాపం పెడుతుంది. మహాభారత యుద్ధం చివరి రోజున పాండవులు ఆనందించకపోగా తమ బంధువులు, సైనికుల మరణం పట్ల చింతిస్తారు. ఈ విధ్వంసం మొత్తం చూసిన కృష్ణుడు కూడా నిశ్చేష్టుడై ఉండిపోతాడు. ఆ సమయంలో దూరం నుంచి గట్టిగా ఏడుపులు వినిపిస్తుంటాయి. ఆ ఏడుపు గాంధారిది. ఆమె తన మొదటి సంతానం దుర్యోధనుడి దగ్గర కూర్చుని ఏడుస్తుంటుంది. ఆ సమయంలో పాండవులు, కృష్ణుడు వచ్చారని గాంధారికి చెబుతాడు సంజయుడు.

ఆగ్రహంతో ఊగిపోయిన గాంధారి..నేను నిత్యం పూజించే శ్రీమహావిష్ణువు అయినా నువ్వు ఈ విధ్వంసాన్ని ఆపలేకపోయావని దుమ్మెత్తిపోస్తుంది. విష్ణువు రూపమైన నీకు సాధ్యం అయి కూడా ఆపని చేయలేదని నిందిస్తుంది. మీ తల్లి దేవకిని అడుగు..బిడ్డలు పోయిన బాధేంటో తెలుస్తుంది...ఆమె ఏడుగురు పిల్లలను పుట్టిన వెంటనే కోల్పోయింది..నేను నా నూరుగురు కొడుకులను యుద్ధంలో కోల్పోయానని శోకాలు పెడుతుంది.

గాంధారి మాటలు విన్న కృష్ణుడు ఓ చిరునవ్వు నవ్వి..ఇదంతా జరుగుతుందని ముందే దుర్యోధనుడికి మిగతా కౌరవులకు కూడా చెప్పానని అంటాడు. అప్పటికీ ఆగ్రహం చల్లారని గాంధారి.. నా విష్ణు భక్తి నిజమైతే ... నా పతిభక్తిలో ఎలాంటి లోపం లేకపోతే ఈరోజు నుంచి 36ఏళ్లలో నువ్వు మరణిస్తావని శపిస్తుంది. అంతేకాదు.. యాదవులు కూడా ఒకర్నొకరు కొట్టుకు చస్తారని, ద్వారక నీట మునుగుతుందని శపిస్తుంది. ఆ తర్వాత కాసేపటికి ఆవేశం చల్లారి..తాను పెట్టిన శాపం గుర్తుచేసుకున్న గాంధారి కృష్ణుడి పాదాలపై పడి ఏడుస్తుండగా.. ఆమెను పైకి లేపిన కృష్ణుడు ఆ శాపాన్ని అంగీకరిస్తాడు.

మహాభారత యుద్ధంలో కౌరవులకు భీష్మ పితామహుడు, గురు ద్రోణుడు వంటి ఎందరో అనుభవజ్ఞులైన యోధులు అండగా నిలిచారు. కౌరవుల తరపున రణరంగంలో నిలిచారు. మరోవైపు శ్రీ కృష్ణుడు పాండవులకు మద్దతు ఇచ్చాడు. శ్రీ కృష్ణుడి చెప్పిన ప్రకారం పాండవులు మహాభారత యుద్ధంలో విజయం సాధించారు. కౌరవులు అందరూ మరణించారు.

### శ్రీ కృష్ణుడిని దోషిగా భావించిన గాంధారీ

మహాభారత యుద్ధంలో పాండవులకు సహాయం చేసి వారు గెలవడానికి శ్రీ కృష్ణుడే కారణమని.. అదే సమయంలో తన కుమారులందరూ మరణించడానికి కూడా కృష్ణుడే కారణమని ఆమె నమ్మింది. అంతేకాదు శ్రీ కృష్ణుడు కోరుకుంటే మహాభారత యుద్ధం జరిగేది కాదని.. తనకు పుత్ర శోకం ఉండేది కాదని గాంధారి నమ్మింది. అయితే యుద్ధాన్ని కోరుకున్న శ్రీ కృష్ణుడు పాండవులకు అండగా నిలబడి తన వంశం వినాశనానికి కారణం అయ్యాడని.. కోపంతో శ్రీకష్ణుడిని గాంధారి శపించింది. మహాభారత యుద్ధంలో నా వంద మంది కొడుకులు చనిపోయినట్లే.. నువ్వు కూడా మరణిస్తావు.

### గాంధారి శాపం ..ద్వారక నాశనం

గాంధారి తన నూరుగురు కుమారులను పోగొట్టుకుని గర్భ శోకాన్ని అనుభవిస్తూ.. ఆ కోపముతో శ్రీకృష్ణుని నిందించింది. నేను నిర్మలమైన భక్తితో విష్ణుమూర్తిని పూజించినట్లయితే నా కుటుంబం ఎలా నాశనమైందో.. అదే విధంగా మీ వంశం నాశనం అవుతుంది. మీ కళ్ల ముందు విధ్వంసం జరుగుతుంది. మీరు చూస్తూనే ఉంటారు. కానీ ఆ వినాశనాన్ని ఏ విధంగా ఆపలేరు.. అంటూ గాంధారీ కృష్ణుడికి శాపం ఇచ్చింది. గాంధారి మాటలు విన్న శ్రీకృష్ణుడు అమ్మా.. నీవు ఇచ్చిన శాపాన్ని నేను వరంగా భావిస్తున్నాను. ఈ నీ శాపాన్ని నేను అంగీకరిస్తున్నానని చెప్పాడు. యుధిష్ఠిరుని పట్టాభిషేకం తర్వాత శ్రీ కృష్ణుడు ద్వారకా నగరానికి తిరిగి చేరుకున్నాడు. మహాభారత యుద్ధం జరిగిన కొన్ని సంవత్సరాల తర్వాత గాంధారి శాపం నిజ రూపం దాల్చి.. ముసలం పుట్టి యదు వంశాన్ని నాశనం చేసింది. ద్వారకా నగరం మొత్తం నీటిలో మునిగిపోయిందని నమ్ముతారు.

ఆ తర్వాత 36 ఏళ్లు కృష్ణుడు సత్యభామ, రుక్మిణితో సంతోషంగా జీవిస్తాడు. తరువాత 36 ఏళ్ళు భార్య రుక్మిణి... కుమారౌడు సాంబతో సంతోషంగా జీవిస్తాడు. ఓ సారి సప్త రుషులంతా శ్రీకృష్ణ, బలరాముల్ని చూసేందుకు ద్వారకను సందర్శిస్తారు. ఆ సప్త రుషులను ఆటపట్టించేందుకు సాంబ ఒక చిలిపి పని చేస్తాడు. ఆడపిల్ల వేషంలో గర్భవతిలా నటిస్తాడు... దీంతో ఆగ్రహానికి గురైన రుషులు..అదే నిజమై నీ గర్భంలోంచి జన్మించిన బిడ్డద్వారా మీ యాదవవంశం నాశనమవుతుందని శపిస్తారు. అదే జరుగుతుంది.

ఇక గాంధారి శాపం..కృష్ణుడి అవతారం చాలించడం విషయానికొస్తే... గాంధారి శాపం గుర్తుచేసుకుని యాదవ వంశం నాశనమైపోయింది, 36 ఏళ్లు గడిచిందినే శోకంతో ఓ చోట కాలిపై కాలు వేసుకుని ఆలోచనలో మునిగిపోతాడు. ఆ సమయంలో కదులుతున్న కాలివేలు చూసి పక్షి అని భ్రమపడి వేటగాడు బాణం వేస్తాడు. అలా శ్రీకృష్ణుడు అవతారం చాలిస్తాడు.

## గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలె: మారం జగదీశ్వర్



కాంగ్రెస్ఇచ్చిన మాటకు కట్టుబడి సీపీఎస్ ను తొలగించాలని జేఏసీ చైర్మన్? మారం జగదీశ్వర్? డిమాండ్? చేశారు. ఉద్యోగుల జేఏసీ ఎగ్జిక్యూటివ్? సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇప్పటివరకు 4డీఏలు పెండింగ్?లో ఉన్నాయన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ తగిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉద్యోగుల అనేక సమస్యలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రొఫెసర్? కోదండరాంకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే సన్మాన సభను నిర్వహిస్తామన్నారు. ఇవాళ సమావేశంలో జేఏసీలో 27 సంఘాలతో స్టీరింగ్? కమిటీ ఏర్పాటు చేసుకున్నట్లుగా ఆయన తెలిపారు. సెప్టెంబర్?1న పెన్షన్? విద్రోహ దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టాలన్నారు.

## హైదరాబాద్‌లో బంగారం ధరలు..

## 22 క్యారెట్ల పుత్తడి ధర తగ్గి.. 24 క్యారెట్ల ధర పెరుగుదల

### రూ. 220 తగ్గిన 22 క్యారెట్ల బంగారం ధర

### అదే సమయంలో రూ. 170 పెరిగిన 24 క్యారెట్ల పుత్తడి ధర

### వెండి కిలో రూ.91,700గా నమోదు

హైదరాబాద్‌లో నేడు బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. 22 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధరపై రూ. 220 తగ్గి రూ. 66,600కు పడిపోగా, అదే సమయంలో విచిత్రంగా 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ. 170 పెరిగి రూ. 72,650 వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి ధర హైదరాబాద్‌లో కేజీ రూ. 91,700 గా ఉంది.



అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధరలు ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాయి. పెళ్లిళ్ల సీజన్ వేళ గత వారం రోజులుగా పుత్తడి ధరలు కొంత తగ్గుతూ ఉండడం గమనార్హం. బంగారం 10 గ్రాముల ధర రూ. 70 వేలు, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 66 వేలకు అటూఇటుగా నమోదవుతూ వస్తోంది. ఇక్కడ పేర్కొన్న ధరలు ఈ ఉదయం 8 గంటలకు ట్రేడ్ అయినవి మాత్రమే. కొనుగోలు సమయంలో వీటిలో కొంత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉంది. కాబట్టి కొనే ముందు ధరలు ఒకసారి కనుక్కోవడం మంచిది.

# కేంద్ర మంత్రి సింధియాతో రేవంత్ భేటీ.. కేంద్ర ప్రభుత్వానికి సీఎం కీలక విజ్ఞప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్ర టెలికం, కమ్యునికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో భేటీ అయ్యారు. టీఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్ 3గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ను ఆమోదించాలని ఈ భేటీ సందర్భంగా సింధియాకు విజ్ఞప్తి చేశారు. ఆప్టికల్ ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు నెట్‌వర్క్ కల్పించడమే టీ %-% ఫైబర్ లక్ష్యమని కేంద్ర మంత్రికి వివరించారు. 65,000 ప్రభుత్వ సంస్థలకు జీ2జీ, జీ2సీ సేవలు అందించడమే టీ-ఫైబర్ యొక్క ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల గృహాలకు, పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు నెలకు కేవలం రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ - ఎడ్యుకేషన్ సేవలు అందించడం టీ %-% ఫైబర్ లక్ష్యమని చెప్పారు.

టీ-ఫైబర్ అమలుకుగానూ జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ (ఎన్ఎఫ్ఓఎన్) మొదటి దశ మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి త్వరగా అందించాలని సీఎం రేవంత్ రెడ్డి రిక్వెస్ట్ చేశారు. ఎన్ఎఫ్ఓఎన్ మొదటి దశ నుంచి భారత్ నెట్ మూడో దశకు మార్చడానికి తెలంగాణ గవర్నమెంట్ పంపించిన డీపీఆర్?ను ఆమోదించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న భారత్ నెట్ ఉద్యమి ప్రోత్సాహక పథకాన్ని టీ-ఫైబర్ కు వర్తింపజేయాలన్నారు. అదే విధంగా.. టీ-ఫైబర్? ఇంప్లిమెంట్?కు రూ.1779 కోట్ల మేర వడ్డీ లేని దీర్ఘకాలిక రుణాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా జ్యోతిరాదిత్యా సింధియాకు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

# సీఎం సొంతూరులో మహిళా జర్నలిస్ట్‌లపై దాడి... స్పందించిన మహిళా కమిషన్

- కొండారెడ్డిపల్లెలో మహిళా జర్నలిస్టులపై దాడి
- కాంగ్రెస్ వర్గీయులు దాడి చేశారంటూ మహిళా జర్నలిస్టుల ఫిర్యాదు
- ఈరోజు మహిళా కమిషన్ చైర్ పర్సన్‌ను కలిసిన జర్నలిస్టులు
- ఘటనపై త్వరగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు లేఖ

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లెలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడి ఘటన పట్ల మహిళా కమిషన్ స్పందించింది. ఈ ఘటనపై సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూలు ఎస్పీకి మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద లేఖ రాశారు. నిందితులపై తీసుకున్న చర్యలను పేర్కొంటూ నివేదిక ఇవ్వాలని ఆ లేఖలో పేర్కొన్నారు.



కొండారెడ్డిపల్లెలో దాడికి గురైన మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి శుక్రవారం నేరెళ్ల శారదను కలిశారు. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. తమపై కాంగ్రెస్ వర్గీయులు దాడి చేశారంటూ ఈ జర్నలిస్టులు గురువారం స్థానిక పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. రుణమాఫీపై రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి వీరిద్దరు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన దాదాపు 150 మంది తమను చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ మీకేం పని అంటూ తమపై దౌర్జన్యానికి దిగారని ఆ జర్నలిస్టులు తెలిపారు. తాము రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలకు సంబంధించిన మెమొరీ కార్డులను లాక్కున్నారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు మహిళా కమిషన్‌కు వినతిపత్రం అందించారు.

## బ్లిట్జ్ పత్రికలో యువతితో రాహుల్ గాంధీ ఫొటో...

# సోనియా ఇంటికి వెళ్లిన రఘునందన్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:**మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్ రావు ఢిల్లీలోని సోనియా గాంధీ నివాసానికి వెళ్లారు. బంగ్లాదేశ్ బ్లిట్జ్‌లో వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటోపై నిన్న బీజేపీ ఎంపీ మీడియా సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి బంగ్లాదేశ్ బ్లిట్జ్ మేగజైన్‌లో వచ్చిన ఆయన ఫొటోలను చూపిస్తానని నిన్న మీడియా సమావేశంలో వెల్లడించారు. బ్లిట్జ్‌లో రాహుల్ గాంధీతో ఉన్న అమ్మాయి ఎవరు? ఆమెతో పెళ్లైందా? లేదా, రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? చెప్పాలని నిన్న ప్రశ్నించారు. ఈరోజు హఠాత్తుగా ఆయన ఢిల్లీలో గాంధీల నివాసం వద్ద ప్రత్యక్షమయ్యారు. బ్లిట్జ్ మేగజైన్ కాపీలను రాహుల్ గాంధీ కార్యాలయంలోని సిబ్బందికి ఇచ్చారు.

అనంతరం, ఆయన రాహుల్ గాంధీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ... బ్లిట్జ్ పత్రికలో వచ్చిన ఈ ఫొటోలకు సంబంధించిన కాపీలను రాహుల్ గాంధీకి ఇచ్చేందుకు తాను వచ్చానని, కానీ ఆయన సమావేశంలో ఉన్నట్లు తెలిసిందన్నారు. రిసెప్షన్ సిబ్బంది ఈ కాపీలను తీసుకున్నదని తెలిపారు. బ్లిట్జ్‌లో వచ్చిన ఈ కథనంపై వారు ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలన్నారు. సోనియా గాంధీ నివాసంలోనే రాహుల్ గాంధీ ఉంటున్నారని, అందుకే ఇక్కడే ఈ కాపీలను ఇచ్చినట్లు చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ నుంచి సరైన వివరణ వస్తుందని తాను భావిస్తున్నానన్నారు.

## కేసీఆర్, కేటీఆర్, కవితలకు జీవితాంతం మా పార్టీతో ఎలాంటి సంబంధం ఉండదు: ధర్మపురి అరవింద్



**హైదరాబాద్ పెన్ పవర్:**కేసీఆర్, కేటీఆర్, కవితలకు బీజేపీతో జీవితాంతం ఎలాంటి సంబంధం ఉండదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... "మీ ఛానళ్లన్నీ... బీజేపీలో బీఆర్ఎస్ విలీనం... బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అని చూపిస్తున్నాయి. మీకు అలా ఎవరైనా చెప్పారా?" అని మీడియాను ప్రశ్నించారు.

ఈ పార్టీలో గెలిచి ఆ పార్టీలోకి వెళ్లడం... ఆ పార్టీలో గెలిచి ఈ పార్టీలోకి వెళ్లడం.. నేటి రాజకీయాలు ఇలా సాగుతున్నాయన్నారు. కానీ ఈ ముగ్గురికి మాత్రం బీజేపీతో జీవితాంతం ఎలాంటి సంబంధం ఉండబోదన్నారు. అందులో ఎలాంటి ప్రశ్నే లేదన్నారు. వేరేవాళ్లు ఎవరు ఎటు దూకుతారో... ఎటు వెళతారో... అవన్నీ నడుస్తుంటాయన్నారు. అయినా వేరే ఎమ్మెల్యేలు (బీఆర్ఎస్ పార్టీకి చెందిన) కాంగ్రెస్ పార్టీలో చేరారు కదా అన్నారు. ఒక ఎమ్మెల్యే అయితే ఏకంగా వెళ్లి కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారని గుర్తు చేశారు. ఇంత జరుగుతుంటే బీజేపీ, బీఆర్ఎస్ విలీనం అనడమేమిటన్నారు. మీరు (జర్నలిస్టులు) ఎవరితోనైనా విలీనమయ్యారా? అని ప్రశ్నించారు.

అంతకుముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారని, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కానీ బీజేపీని అనడమేమిటన్నారు. మా పార్టీలోకి ఎవరైనా రావాలంటే రాజీనామా చేసి రావాలని తమ పార్టీ నేత బండి సంజయ్ చాలా స్పష్టంగా ఇప్పటికే చెప్పేశారన్నారు. ట్రిపుల్ 'కే'... కేసీఆర్, కేటీఆర్, కవితలను బీజేపీ దరిదాపుల్లోకి కూడా రానీయమన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిపై అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో పార్టీని గెలిపించే వ్యక్తి రాష్ట్ర అధ్యక్షుడిగా కావాలన్నారు. ఇందులో మరో ఆలోచన లేదన్నారు. ఒకటే చెబుతున్నాం... గెలిపించే వ్యక్తి అధ్యక్షుడు కావాలన్నారు.

## మాదాపూర్‌లో ఆన్‌లైన్ వ్యభిచారం.. 17 మంది విదేశీ యువతుల అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఆన్‌లైన్ ద్వారా విటులను ఆకర్షించి, గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా పోలీసులకు చిక్కింది. ఓ వెబ్‌సైట్ ద్వారా బుకింగులు చేసి, తమ ఇంట్లోనే ఈ ముఠా కార్యకలాపాలు నిర్వహి స్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిర్వాహకుడు శివకుమార్‌తోపాటు ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. అలాగే, వ్యభిచారం నిర్వహిస్తున్న 17 మంది విదేశీ యువతలను అదుపులోకి తీసుకుని సేఫ్ హౌస్‌కు తరలించారు. నిందితుడి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, 25 హెచ్ఐవీ పరీక్ష కిట్లు, హుక్కా పాట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

- ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని పరిస్థితి నెలకొందన్న హరీశ్ రావు
- మందుల కొరత, '1962' పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయంపై లేఖ
- పశుసంవర్ధక శాఖ సీఎం వద్దే ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శ



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందులు లేని పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయానికి దన్నుగా, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని లేఖలో విమర్శలు గుప్పించారు. పశుసంవర్ధక శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉందని గుర్తు చేశారు.
ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందుల కొరత, 1962 పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయం, మూగజీవాల మౌన రోదనను తొలగించడంలో ప్రభుత్వ వైఫల్యంపై తాను సీఎంకు లేఖ రాశానని హరీశ్ రావు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు."వ్యవసాయంలో దన్నుగా నిలుస్తూ, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణ పట్ల మీ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం శోచనీయం. పశుసంవర్ధక శాఖ కూడా మీ వద్దే ఉన్నప్పటికీ మూగజీవాల మౌనరోదనను మాత్రం పట్టించుకోవడం లేదు." అని హరీశ్ రావు ఆ లేఖలో పేర్కొన్నారు.రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందని, ఎమర్జెన్సీ మందులు సహా పెయిన్ కిల్లర్స్, విటమిన్స్, యాంటీ బయాటిక్స్ వంటి అన్ని రకాల మందుల సరఫరా తొమ్మిది నెలలుగా నిలిచిపోయిందన్నారు. పాలిచ్చే జీవులకు పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రూ.2 వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఇది వారికి అదనపు ఆర్థిక భారంగా మారిందన్నారు.మూగజీవాల్లో అంతర పరాన్నజీవులను నివారించేందుకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయాల్సి ఉంటుందని, 9 నెలల నుంచి నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవడంతో కాలేయం, జీర్ణాశయం, చిన్నపేగు భాగాల్లో పరాన్న జీవులు చేరి రక్తహీనతకు గురి చేస్తున్నాయన్నారు. దీంతో రోగ నిరోధకశక్తి తగ్గి మూగజీవాలు బలహీనంగా మారుతున్నాయన్నారు.
దీంతో వ్యాధుల బారిన పడ్డ జీవులు ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయన్నారు.
పశువైద్యశాలల్లో మందులు లేకపోవడంతో మూగజీవాలకు చికిత్స అందించలేకపోతున్నామని, తప్పనిసరి పరిస్థితిలో మందుల చిట్టీ రాసి బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అనారోగ్యం పాలైన మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి తక్షణ చికిత్స అందించేందుకు గాను '1962' నెంబర్‌తో పశువైద్య సంచార వాహనాలను తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇది దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఈ విధానంపై ప్రశంసలు కురిపించిన కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని సూచించిందన్నారు. అంతటి గొప్ప కార్యక్రమ నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. సంచార వాహనాల్లో మందుల కొరత కారణంగా అత్యవసర పరిస్థితుల్లో మూగజీవుల ప్రాణాలు కాపాడాలనే సదాశయం నీరుగారిపోతోందన్నారు. మరోవైపు వాహన ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.
అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మీరు గాని, ఉన్నతాధికారులు గానీ ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడం మూగజీవుల సంరక్షణ పట్ల మీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఇప్పటికే గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని అటకెక్కించారని... చేపల పంపిణీని ఆలస్యం చేస్తున్నారన్నారు. ఇప్పుడు మందులు సరఫరా చెయ్యక మూగజీవాల మరణాలకు కారణమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
వానాకాలంలో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, నిర్లక్ష్యం వీడి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పశు వైద్యశాలల్లో, పశు వైద్య సంచార వాహనాల్లో అవసరమైన మందులు ఉండేలా చూడాలని, నట్టల నివారణ మందులు సరఫరా చేయాలని, '1962' పశువైద్య సంచార వాహనాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# నల్లగొండలో అమానవీయ ఘటన.. కుర్చీలోనే ప్రసవించిన మహిళ!

- నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన
- తొలుత పురిటినొప్పులతో జిల్లాలోని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన బాధితురాలు
- అక్కడ వైద్యులు లేకపోవడంతో నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన కుటుంబీకులు
- మూడో కాన్పు పేరిట అక్కడి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం బయట కుర్చీలో కూర్చోబెట్టడంతో అక్కడే ప్రసవం

హైదరాబాద్ పెన్ పవర్:నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంతో కుర్చీలోనే ఓ మహిళ ప్రసవించింది. నేరడుగొమ్ము మండలానికి చెందిన నల్లవెల్లి అశ్విని అనే గర్భిణి గురువారం రాత్రి పురిటినొప్పులతో జిల్లాలోని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అయితే, అక్కడ వైద్యులు లేకపోవడంతో నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది రిఫర్ చేశారు.దాంతో దేవరకొండ నుంచి అశ్విని ఆమె కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో నల్గొండ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత ఆసుపత్రి సిబ్బంది వారిని ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ దుర్భాషలాడారు. మూడో కాన్పు అంటున్నారు కనుక దేవరకొండలోనే చేయించక ఇక్కడి దాక రావడం అవసరమా? అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. అక్కడ డాక్టర్లు లేరని, అందుకే ఇక్కడికి తీసుకొచ్చామని కుటుంబ సభ్యులు చెప్పారు. ఇక అశ్వినిని నర్సులు బయట కుర్చీలోనే కూర్చోబెట్టారు. పాపం.. నొప్పులు వస్తున్నాయని చెప్పిన అక్కడి సిబ్బంది ఎవరూ ఆమెను పట్టించుకోలేదు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తీవ్ర నొప్పులతో అశ్విని కుర్చీలోనే ప్రసవించింది.
దాంతో కుర్చీ కింద తీవ్ర రక్త స్రావమైంది. అప్పుడు నర్సులు హడావుడిగా వచ్చి ఆమెపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ లోపలికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లిబిడ్డ క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇలా తన భార్య పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భర్త ఆంజనేయులు కోరారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణ చందర్ వెంటనే ఆసుపత్రికి వచ్చారు. అసలేం జరిగిందో అక్కడి సిబ్బందిని, బాధితులను అడిగి వివరాలు తీసుకున్నారు. బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# నేపాల్‌లో నదిలోకి దూసుకెళ్లిన బస్సు.. అందులో 40 మంది భారతీయులు..



హైదరాబాద్ పెన్ పవర్:నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. 40 మంది భారతీయ పర్యాటకులతో ప్రయాణిస్తున్న బస్సు టనహూన్ జిల్లాలో మర్స్యంగడి నదిలోకి దూసుకెళ్లింది. బస్సు పోఖరా నుంచి ఖాఠ్మాండు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సుకు యూపీ నంబర్ ప్లేట్ ఉన్నట్టు గుర్తించారు. ఈ ఘటనలో పలువురు గల్లంతైనట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# జనవాసాల నడుమ.. విషసర్పాల సంచారం..

## భయాందోళనలో స్థానిక ప్రజలు తక్షణ చర్యలకు వేడుకోలు..





**అల్వాల్, పెన్ పవర్, ఆగస్టు 23:** నివాస గృహాల మధ్యలో ఖాళీ స్థలాలు ఉండడంతో అందులో ఇటీవల కురిసిన వర్షాలకు.. దట్టంగా చెట్లు అల్లుకుపోయి, అటవీ ప్రాంతాన్ని తలపిస్తూ విష సర్పాలకు నిలయంగా తయారైందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.. అల్వాల్ సర్కిల్, అల్వాల్ రోడ్డు నంబర్ 18 లో ఖాళీ స్థలం ఉండటంతో ఇరుగుపొరుగు ఆ స్థలాన్ని చెత్త వేయడానికి వాడటం, అందులో పాములు, పందికొక్కులు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.. దీంతో పరిసర ప్రాంతాలవారు భయానికి లోనై ఇబ్బందులకు గురవుతున్నారు. ఖాళీగా ఉందని కొందరు చెత్తను వేస్తూ చెత్తడంపింగ్ యార్డుగా మార్చారని ఆరోపిస్తున్నారు.. తద్వారా ఈ వర్షాలకు చెత్త మురిగి కంపు కొడుతూ ఈగలు దోమలు విపరీతంగా ఉన్నాయని, ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు జ్వరాలతో అనారోగ్యం బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మహానగర పాలక సంస్థ, అల్వాల్ సర్కిల్ సిబ్బందికి ఎన్ని మార్లు విన్న వించుకున్నా ఫలితం శూన్యమని వాపోతున్నారు. జి.హెచ్.యం.సి. కమిషనర్ ఆమ్రపాలి అడవులను తలపించే ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని, అలా చేయని వారి స్థల యాజమానుల పై చర్యలుంటాయని మీడియా ముఖంగా హెచ్చరించినా, క్షేత్ర స్థాయిలో మాత్రం వారి ఆదేశాలు అమలైన దాఖలాలు కనిపించడం లేదు. నిత్యం పాములు నివాస గృహాల్లోకి, రోడ్లపైకి రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇక దోమలతో వివిధ రకాల జ్వరాలు సోకి చిన్నా పెద్దలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రజా పాలన అంటున్న నేటి ప్రభుత్వం, పాలకులు, అధికారులు ప్రజారోగ్యం ను కాపాడాల్సిన భాధ్యత గా గుర్తించి పరిసరాల పరిశుభ్రత పరిరక్షణ గురించి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశలో సర్కార్ సంభందిత అధికారుల స్పందించి భాధ్యుల పై చర్యల ద్వారా స్థానిక ప్రజలకి పరిసరాలు పరిశుభ్రతను, అనుకూల వాతావరణాన్ని కల్పించాలని జాతీయ పురస్కార గ్రహీత ఎం.విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



# ఖర్గే, రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశం**

**ఏఐసీసీ కార్యాలయంలో అగ్రనేతలతో సీఎం భేటీ**

**సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, మంత్రులు, ముఖ్య నేతలు**

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలను పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఏఐసీసీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి మార్పు, మంత్రివర్గంలో మార్పులు, పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఈ భేటీలో చర్చ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపిక, కేబినెట్ విస్తరణపై గతంలోనూ పలుమార్లు చర్చలు జరిగాయి. అయితే రాష్ట్ర ముఖ్య నేతల మధ్య ఏకాభిప్రాయం రావాల్సి ఉంది.

**మంత్రివర్గంలో నలుగురికి చోటు?**

మంత్రివర్గంలోకి మరో ఆరుగురిని తీసుకునే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం నలుగురిని తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాబితాలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వివేక్, మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, వాకాటి శ్రీహరి ముదిరాజ్‌లలో నలుగురికి చోటు దక్కనుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

పీసీసీ అధ్యక్ష పదవిలో బీసీల నుంచి మధుయాష్కీ గౌడ్, మహేశ్ కుమార్ గౌడ్, సంపత్ కుమార్, లక్ష్మణ్ కుమార్, బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకొని వీరిలో ఒకరికి అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు.

